ఆశ కార్యకర్తల అరెస్టు

మిరుదొడ్డిలో ఆశ వర్కర్లను అరెస్టు చేసినపోలీసులు

మద్దూరులో ఆశ కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతున్న యాదగిరి

మిరుదొడ్డి, డిసెంబర్ 10: చలో హైదరాబాద్ కార్యక్రమానికి మంగళవారం వెళ్లకుండా ముందస్తుగా మిరుదొడ్డి పోలీసులు ఆశ కార్యకర్తలను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించే వరకూ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆశ వర్కర్లు ఇంద్ర, కవిత, స్వప్న పాల్గొన్నారు.

మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో..

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 10: తమ వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నా నేపథ్యంలో మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన ఆశ కార్యకర్తలను మద్దూరు ఎస్సై మహబూబ్ ఆధ్వర్యంలో పోలీసులు ముందోస్తు అరెస్టు చేశారు. అరెస్ట అయిన ఆశ కార్యకర్తల్లో పాకాల జయ, మణెమ్మ, మంజుల, బాబాయి, ప్రవళిక, కమలమ్మ, రజితలు ఉన్నారు. అరెస్టయిన ఆశకార్యకర్తలకు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆలేటి యాదగిరి సంఘీభావాన్ని ప్రకటించారు.

ముందస్తు అరెస్టులు, దాడి అమానుషం

హుస్నాబాద్, డిసెంబర్ 10: ఆశ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడంతో పాటు హైదరాబాద్‌లో నిరసన తెలుపుతున్నవారిపై పోలీసులు దాడికి పాల్పడటం అమానుషమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. అరెస్టయిన ఆశ కార్యకర్తలను వారు హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కలిసి సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

హుస్నాబాద్ పీఎస్‌లో ఆశ వర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి

బెజ్జంకి, డిసెంబర్ 10: ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గుగ్గిళ్ల, తిమ్మాయ్యపల్లి, పోతారం, నర్సింహులపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుపై ప్రజలతో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ ప్రజలకు హానికరమని, పరిశ్రమల రద్దు కోసం ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఆయన వెంట నాయకులు గోపాలస్వామి, శశిధర్, శ్రీనివాస్, ప్రశాంత్, సాయికుమార్, ఎల్లయ్య ఉన్నారు.

మానవ హక్కులను గౌరవించాలి

ర్యాలీలో పాల్గొన్న సాయిరమాదేవి, జడ్జీలు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 10: మానవ హక్కులను ప్రతిఒక్కరూ గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మానవ హక్కుల దినోత్సవం మంగళవారం కోర్టు ప్రాంగణంలో జరిగింది.ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్జిలు స్వాతిరెడ్డి, చందన, తరణి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి,న్యాయవాదులు సత్యనారాయణ, ప్రవీణ్‌రెడ్డి, పత్రి ప్రకాశ్, భరోసా, షీటీమ్ సిబ్బంది, విద్యార్థులు, న్యాయసేవాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రాజిరెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 10: టెన్త్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని లద్నూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి అనేది ఓ పునాదిలాంటిదన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, బీఆర్ఎస్ నాయకుడు అన్నోజు శ్రీనివాస్, ఎస్ఆర్ పీఆర్వోలు రవీందర్, శ్రీనివాస్, క్లాస్ టీచర్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణ వేదిక ప్రదేశంలో పనులు షురూ..

చదును చేయిస్తున్న ఆలయ వర్గాలు

చేర్యాల, డిసెంబర్ 10: కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవ ఏర్పాటు పనులను ఆలయ ఈవో బాలాజీ ఆదేశాల మేరకు ఆలయ అధికారులు, సిబ్బంది మంగళవారం ప్రారంభించారు. డిసెంబర్ 28న మల్లన్న కల్యాణ మహోత్సవం నిర్వహించే తోటబావి కల్యాణ వేదిక వద్ద చదును చేసే పనులుకు ఆలయవర్గాలు శ్రీకారం చుట్టాయి.కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది శ్రీరాములు, భాస్కర్‌రావు, సతీశ్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో నిర్ణయాధికారం రావాలి

మాట్లాడుతున్న మధనం గంగాధర్

గజ్వేల్, డిసెంబర్ 10: రాజకీయాల్లో నిర్ణయాధికారం రావాలని, అప్పుడే అనుకున్న విధంగా ప్రజలకుసేవ చేసే అవకాశాలు ఉంటాయని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మధనం గంగాధర్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టభద్రులు ఆలోచించి విలువైన ఓటును వినియోగించుకున్నప్పుడే ఆనాడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటుకు సార్థకత లభిస్తుందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగ యువతీ యువకుల సమస్యలపై గళం విప్పేలా పోరాటానికి సిద్ధంగా ఉంటానని, అందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు రవికుమార్, వెంకట్, సాగర్, శ్రీనివాస్, నిర్వాహకుడు కనకయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న చంద్రారెడ్డి

చేర్యాల, డిసెంబర్ 10: జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయమని టీజీయూఈఈయూ(సీఐటీయూ)ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని శివజ్యోతి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం హుస్నాబాద్ డివిజన్ మహాసభ రాములు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కార్మికుల సమస్యలపై ఈనెల 14న జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ జిల్లా నాలుగో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటం మధు, రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ గుంటుపల్లి సధాకర్, జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు భగవాన్‌రెడ్డి, భూపతిరాజు, నర్సింహులు, శ్రీధర్, చందు, వైదేవి, శ్రీనివాస్, లింగం, రాము, వినయ్‌రెడ్డి,కుమార్, గణేశ్ పాల్గొన్నారు.

దుబ్బాకలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

చేర్యాల మండలం ముస్త్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న పెడుతల ఎల్లారెడ్డి తదితరులు

చిన్నకోడూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వేలేటి రాధాకృష్ణశర్మ, బీఆర్ఎస్ నాయకులు

నిరసన వెల్లువ

- జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు
- త్వరలోనే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరిక

తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడంపై నిరసనలు వెల్లువెత్తాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణతల్లిని అవమానపర్చేందుకు కాంగ్రెస్ నీచరాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం అవలంబిస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 10

హుస్నాబాద్‌లో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

కొమురవెల్లిలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం అనంతరం నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధూళిమిట్టలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి: గుండారంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి): నిరసినగండ్లలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అక్కన్నపేట: అక్కన్నపేటలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేట అర్బన్: ఎన్సాన్‌పల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణరావుపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సమీకృత భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చేర్యాల, డిసెంబర్ 10: ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన సమీకృత భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఆ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ 2018లో ప్రారంభించిన సమీకృత భవన నిర్మాణ పనులు ఆరేండ్లు దాటినా పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా భవన నిర్మాణ పనులు పూర్తి చేయించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పాలకుల అశ్రద్ధతో కాంట్రాక్టర్ నాసిరకంగా భవన నిర్మాణ పనులు చేపట్టాడని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు విచారణ చేపట్టాలన్నారు.చేర్యాల ప్రాంతంపై ఎలాంటి శ్రద్ధ ఉన్నా మంత్రి కొండా సురేఖ, అధికార పార్టీ నాయకులు వెంటనే పనులు ప్రారంభింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, ఇప్పకాయల శోభ, రామచంద్రం, చందు, రవీందర్, భాస్కర్, డానియల్, సిద్ధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనల వెల్లువ

విద్యార్థులను అభినందిస్తున్న నాగపురి ఉపాధ్యాయులు

చేర్యాల, డిసెంబర్ 10: మండల స్థాయిలో ఇటీవల జరిగిన జీవశాస్త్ర ప్రతిభా పరీక్షలో తెలుగు మీడియం విభాగంలో ప్రతిభ చూపించిన మండలంలోని నాగపురి పాఠశాలకు చెందిన డి.పూజిత (ప్రథమ), ఎస్. సంధ్య (ద్వితీయ) బహుమతులు సాధించిన ఇరువురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇరువురు విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వారిని అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కె.స్వర్ణకుమార్, ఉపాధ్యాయులు పద్మ, నిరుపమ, అందే విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, యాదగిరి, మాధవి, కనలింగం, రాజేశ్వరి, ఉమర్, స్వామి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 10: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి పక్కన పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మానవ వనరుల కార్యాలయంలో ఎదుట పూర్తి స్థాయి సమ్మెకు దిగుతున్నట్లు కాంట్రాక్టు ఉద్యోగులు ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కల్లబొల్లి మాటలు చెప్పి కాంట్రాక్టు ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ సమస్యలను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు విష్ణు, కిష్టయ్య, మతిన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు

లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

దుబ్బాక, డిసెంబర్ 10: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌ను మంగళవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుబ్బాక ఎంపీడీవో భాస్కరాశర్మ నేతృత్వంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్, సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ పాఠశాలను సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, వంట నిర్వాహకులకు సూచించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాట్లాడుతున్న బాలనర్సయ్య

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 10: కార్మికులందరికీ కనీస వేతనాల జీవోను విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద జాలిగామ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో బర్మా కొమురయ్య, కనకయ్య, గొడుగు నారాయణ, ఆరుట్ల నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం

చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

గజ్వేల్, డిసెంబర్ 10: జీవితంలో ఏమీ సాధించాలన్నా విద్యార్థి దశే చాలా కీలకమైందని సీఐలు సైదా, మురళి తెలిపారు. మంగళవారం పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కల్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. అపరిచితుల మాటలు నమ్మి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, అప్పుడే మంచి ఆలోచనలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు

తుంగిఖల్సాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శేషశయన

వర్గల్, డిసెంబర్ 10: వరిసాగుచేసిన రైతులు యాసంగి దుక్కుల కోసం వరికొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి శేషశయన సూచించారు. మంగళవారం మండలంలోని తుంగిఖల్సాలో యాసంగిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేషశయన మాట్లాడుతూ వరికొయ్యలను తగలబెట్టడం వల్ల పంటదిగుబడికి అవసరమైన పోషకాలు నశిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో ధర్మేంద్ర, రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్ స్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబర్ 10: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల వినతి

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు రావుల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, రాజారెడ్డి, వెంకటస్వామి, సంపత్‌కుమార్, శ్రీలత, పౌరిల్, శారత, కళావతి, మహేశ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్ విగ్రహం ఆవిష్కరణ

హుస్నాబాద్‌లోని నాగారం రోడ్డులో మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్ విగ్రహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, హౌజింగ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.

13న హుండీల లెక్కింపు

చేర్యాల, డిసెంబర్ 10: కొమురవెల్లి మల్లికార్జునస్వామి హుండీలను ఈనెల 13న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి నగదు హుండీలతో పాటు భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకున్న బియ్యం హుండీలను సైతం విప్పి వాటిని తూకం వేయనున్నట్లు తెలిపారు. మహామండపంలో ఉదయం 9గంటలకు ప్రారంభించే హుండీల లెక్కింపునకు ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు పోలీసు, రెవెన్యూ, బ్యాంకు అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. ఏఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

గజ్వేల్, డిసెంబర్ 10: మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన వాహనదారులను మంగళవారం గజ్వేల్ కోర్టులో హాజరుపర్చగా వారికి జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపిన 18మందికి రూ.11,500 జరిమానాను మేజిస్ట్రేట్ ప్రియాంక విధించినట్లు తెలిపారు.

జూదం స్థావరంపై పోలీసుల దాడి

చిన్నకోడూరు డిసెంబర్ 10: చిన్నకోడూరు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని గోనెపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి హోటల్‌లో కొంతమంది జూదం ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 4964 వేల నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న సర్వే

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 10: ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం పట్టణంలో సర్వే కొనసాగుతున్నది. మంగళవారం పలువార్డులో వార్డు అధికారులు ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిస్థలం ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించి సమాచారాన్ని ఫోన్‌యాప్‌లో నమోదు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 10 : కొండపాక మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన ఉప్పరి పరశురాములు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందాడు. బాధితుడికి ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం బాధిత కుటుంబీకులకు మాజీ ఎంపీటీసీ యాదగిరి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామ శంకరయ్య, నాయకులు మంద శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేబర్తి పంచాయతీ కార్యదర్శికి ఉత్తమ అవార్డు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్10: మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మాధవ్‌జాదవ్‌ను జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. మంగళవారం కలెక్టర్ మనుచౌదరి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి నుంచి ఆయన అవార్డు అందుకున్నారు.

వేతనాలు ఇప్పించాలి

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 10: రెండునెలలు దాటినప్పటికీ వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ కార్మికులు కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం వారు మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. త్వరలోనే కార్మికుల వేతనాలు ఇప్పించేందుకు కృషిచేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

కానిస్టేబుళ్ల మృతి కలిచివేసింది

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 10: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుళ్ల మృతి కలిచి వేసిందని రిటైర్డు పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నవీన్, వెంకట్, పరం ధాములు మృతికి మంగళవారం పోలీస్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు. పోలీస్ సంఘం నాయకులు వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, చంద్రయ్య, విశ్వనాథం పాల్గొన్నారు.

ఎయిర్ బస్సు డ్రైవర్ల నిరసన

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 10: డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ సిద్దిపేట బస్సు డిపో ఎదుట ఎయిర్ బస్సు డ్రైవర్ల యూనియన్ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. యూనియన్ అధ్యక్షుడు రవి, నేతలు ఖలీల్, మల్లారెడ్డి, లింగం, శ్రీనివాస్‌రెడ్డి, చందు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 10: ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేటలోని సమీకత జిల్లా కార్యాలయ సముదాయ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరాపింఛన్లపై 36 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డ